# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

OFFICIAL REPORT

గురువారం, డిసెంబరు 18, 2014

**THURSDAY, 18TH DECEMBER, 2014**

14వ శా.స. 3 వ సమావేశం, వాల్యూం-5 నంబరు-1

**14TH L.A. III – SESSION, VOL-5 NO.-1**

శక సంవత్సరం-1936, అగ్రహాయనం -27

**27-Agrahayan, 1936 – S.E.**

**శాసన సభ సచివాలయం**

**పబ్లిక్ గార్డెన్స్**

**హైదరాబాదు- 500 004.**

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS, NAMPALLY**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | డా. కోడెల శివప్రసాదరావు |
| ఉప సభాపతి | : | శ్రీ మండలి బుద్ధప్రసాద్ |
| కార్యదర్శి(ఇంచార్జ్) | : | శ్రీ కె.సత్యనారాయణ రావు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎం. విజయరాజు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి.వి.సుబ్బారెడ్డి<br>శ్రీ కె.రాజకుమార్<br>శ్రీమతి ఆర్.వనితారాణి<br>శ్రీ పి.నరసింహ<br>శ్రీ బి.కమలాకర్<br>డా.వై.కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె.వెంకటేశ్వరరావు<br>శ్రీ డి.జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి.ప్రభాకర్‌రావు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ  శ్రీనివాస్ అల్లాడి |

---

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

**(14వ శాసన సభ)**
**(మూడవ సమావేశము : మొదటి రోజు )**

**గురువారం, డిసెంబరు 18, 2014**
**సభ ఉ.గం.09.00.లకు ప్రారంభమైనది**
**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

--------------

## విషయ సూచిక


| | | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | సభ సమావేశం (ఉ.గం.9.00) | ..... | 5 |
| 2. | సంతాప తీర్మానాలు | ...... | 5-24 |
| 3. | సభ వాయిదా (ఉ.గం.10.12 ని) | ..... | 24 |

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ

## 14వ శాసనసభ, 3వ సమావేశం

## గురువారం, 18వ తేది డిసెంబరు, 2014

*** 

**(సభ ఉదయం సమయం గం.09.00లకు సమావేశమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)**

**(జాతీయ గీతాలాపనతో సభ ప్రారంభమయినది)**

* * *

మిస్టర్ స్పీకర్ః తిరుపతి నియోజకవర్గ గౌరవ శాసన సభ్యులు శ్రీ ఎం.వెంకటరమణ గారి మృతి పట్ల సంతాప తీర్మానం. Yes, Chief Minister Garu...

SRI NARA CHANDRABABU NAIDU: Sir, I beg to move:

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri M.Venkataramana, Member of Andhra Pradesh Legislative Assembly, and conveys its deep sense of sympathy to the members of the bereaved family".

MR.SPEAKER: Motion moved. Yes, Chandrababu Naidu garu.

శ్రీ నారా చంద్రబాబునాయుడు (కుప్పం)ఃఅధ్యక్షా, నిన్నటి వరకు మనందరి మధ్యలో ఒకడిగా ఉండి, చాలా కలుపుగోలుతనంగా, అందరితో చాలా సన్నిహితంగా ఉండే వెంకటరమణగారు ఈరోజు మన మధ్య లేరంటే నమ్మలేకపోతున్నాం. వారి మరణం కేవలం తిరుపతి ప్రజలకే కాకుండా, తెలుగుదేశం పార్టీకి కూడా తీరనిలోటు. అస్వస్థతగా ఉండడంతో, ఒకసారి ఇక్కడి ఆసుపత్రిలో కూడా వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఇటీవల ఒక ఫంక్షన్‌కు హాజరైనప్పుడు, సుస్తీగా ఉన్నప్పటికీ లెక్కచేయకుండా, ప్రజల సమస్యలు తెలుసుకోవాలని, అక్కడున్న వారితో మాట్లాడుతుండగానే ఒక్కసారిగా కుప్పకూలిపోవడం జరిగింది. వెంటనే వారిని ఆసుపత్రికి తీసుకెళ్ళారు. నేను ఎప్పటికప్పుడు ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి, ఆదేశాలు ఇస్తున్నాను. ఆసుపత్రిలో ఉన్న వెంకటరమణ గారితో కూడా మాట్లాడాను. వారు 'నన్ను

సింగపూర్ వెళ్ళమంటున్నారు, నేను వెళతాను. మీరు కూడా వేరే వాళ్ళకి చెప్పండి' అని నాతో అంటే, దానికి కూడా ఆ విధంగా చేస్తానని చెప్పాను. కానీ, ఆయన నేరుగా అపోలో హాస్పిటల్‌కు వెళ్ళడం, ఆపరేషన్ చేసిన తరువాత, పోస్ట్ ఆపరేటివ్ కాంప్లికేషన్స్ వచ్చి ఆయన చనిపోవడం జరిగింది. అది విన్నప్పుడు నేను చాలా బాధపడ్డాను. నేను వారి శ్రీమతి గారితో కూడా మాట్లాడాను. వారి శ్రీమతి గానీ, వారి పిల్లలు గానీ చాలా బాధపడుతూ, మా తండ్రిగారు ఆరోజు అక్కడ ఆపరేషన్ చేయించుకోకుండా, సింగపూర్‌కు వెళ్ళుంటే, ఆయన బ్రతికి ఉండేవారంటూ చాలా బాధపడ్డారు. అంతేకాకుండా, ఆ కుటుంబాన్ని చూస్తే, ఆయన ఏవిధంగా పనిచేసేవారో, ఎంత సహనం కలిగి ఉండేవారో మనకు తెలుస్తుంది. వారు సహనానికి మారుపేరు.

శ్రీ ఎం.వెంకటరమణ గారు 1947 మార్చి, 1వ తారీఖున ఒక సాధారణ కుటుంబంలో ఒక సామాన్యుడిగా జన్మించారు. వారికి ఇద్దరు పిల్లలు. ఇద్దరు పిల్లలూ మూగపిల్లలు. అందులోనూ ఆడపిల్లలు. ఆ ఇద్దరికీ పెళ్ళిళ్ళు చేసి, భార్య, భర్త ఇరువురూ కూడా, ఆ పిల్లలకు సేవ చేస్తూ, వారిని ఆదుకుంటూ ఉంటున్నారు. అదేమాదిరిగా మూగపిల్లలు ఎవరొచ్చినా కూడా, వారికి కాఫీ, టీలు ఇవ్వడం వంటి మర్యాదలు చేస్తూ జీవితం గడిపారు. వారి శ్రీమతి ఎం.ఏ. ఇంగ్లీష్ లిటరేచర్ చేశారు. అయినప్పటికీ, మూగ పిల్లల జీవితం బాగుండాలి, తిరుపతిలో ప్రజల జీవనం బాగుండాలని చాలా సహనంగా ఉండేవారు. నేను చాలామంది రాజకీయనాయకులను చూశాను. కానీ, సహనానికి మారుపేరు వెంకటరమణగారు. అదేమాదిరిగా వారి శ్రీమతి కూడా సేవకు మారుపేరుగా ఉంటారు. నాకు వారి శ్రీమతిగారితో పెద్దగా పరిచయం లేదు. కానీ, ఇటీవల వారితో మాట్లాడిన తరువాత, వారి కుటుంబ పరిస్థితిని చూసిన తరువాత, వారికి ఎన్ని ఇబ్బందులున్నా, వారు ప్రజలకు ఎంతో బాగా సేవ చేశారనేందుకు ఇదొక ఉదాహరణ. అటువంటి వ్యక్తి, ఆయన జీవితాన్ని చూస్తే, ఒక మునిసిపల్ కౌన్సిలర్‌గా వారి రాజకీయ జీవితం ప్రారంభించి, తుడా చైర్మన్‌గా, మునిసిపల్ వైస్ చైర్మన్‌గా, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫీషియో మెంబర్‌గా, ఎం.ఎల్.ఏ.గా ఎనలేని కృషిచేశారు.

అదేమాదిరిగా, నేను ఈమధ్య తిరుమలకు వెళ్ళినప్పుడు, తిరుపతికి వచ్చే పేషంట్‌లకు, వారితో వచ్చే వారి బంధువులకు ఉచితంగా ఆహారం అందించాలని నన్ను కోరారు. ఆదేవిధంగా వెంటనే చర్యలు తీసుకోవడంజరిగింది. ఆహారం పంచడానికి ప్లేట్లు లేకపోతే, ఆయనే స్వంత డబ్బులు పెట్టి, ప్లేట్లు కొని, అన్నదాన కార్యక్రమం పూర్తి చేశారు. ఆ కార్యక్రమం తరువాత మిగిలిన ప్లేట్లను వారు ఇంటికి తీసుకువచ్చారు. వెంకటరమణగారు చనిపోయిన తరువాత పరామర్శించడానికి వెళ్ళిన నాకు మిగిలిన ప్లేట్లను చూపిస్తూ, ఆయన సేవను గుర్తుచేసుకుంటూ వారి శ్రీమతి, పిల్లలు చాలా బాధపడ్డారు. ఆవిధంగా ఎవ్వరికి, ఏ బాధ వచ్చినా తన బాధగా భావించి ముందుకుపోయిన వ్యక్తి వెంకటరమణగారు. ఆయన నిరాడంబరుడు. ఎప్పుడూ చాలా సాదాసీదాగా, అందరినీ కలుపుకునిపోతూ వచ్చారు. ఎవ్వరికీ కూడా ఇబ్బందులు

కలిగించని వ్యక్తి. అదేమాదిరిగా ఎన్ని ఇబ్బందులున్నా, ఆరోగ్య సమస్యలున్నా, కుటుంబ సమస్యలున్నా, అందరితో నవ్వుతూ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ముందుకుపోయినటువంటి వ్యక్తి ఆయన.

అధ్యక్షా, ఇదేమాదిరిగా నాతో చర్చించిన చాలాసార్లు కూడా, తిరుపతి నగరాన్ని ఒక సుందర నగరంగా తయారుచేయాలనీ, ఒక మెగాసిటీగా తయారుచేయాలనీ అంటూండేవారు. హౌసింగ్ స్కీమ్‌లో కట్టిన ఇళ్ళు ఇంకా పూర్తి కాలేదు, వెంటనే వాటిని పూర్తి చేయాలి, అందరికీ ఇళ్ళు ఇవ్వాలని కోరుతూ ఉండేవారు. వారి వద్దకు ఎవ్వరు వచ్చినా నీకు ఏ సమస్యలున్నాయి, నీకు ఇల్లుందా, అంటూ వారిని అడిగి మరీ వారికి ఇళ్ళు ఇప్పించిన వ్యక్తి శ్రీ వెంకటరమణ అని నేను మీకు తెలియజేస్తున్నాను. అదేమాదిరిగా ఇటీవలి ఎన్నికల్లో ఆయన 42,000 ఓట్ల మెజారిటీతో గెలిచారంటే, ఆయనకు ప్రజల్లో ఎంత పాపులారిటీ ఉందో తెలుస్తుంది.

...

దాదాపు వందకు పైగా నాటకాల్లో నటించారు. శాసనసభ్యులకు నిర్వహించే నాటక పోటీల్లో ఆరు సార్లు బంగారు పథకాలను వారు సాధించారు. పెళ్లిళ్ల పేరయ్య, అడవిలో అన్న, ఒరే రిక్షా, తదితర 20 సినిమాల్లో వెంకట రమణ గారు నటించారు. హాస్య నటుడిగా ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. ఆయన నిర్మాతగా కూడా కొన్ని సినిమాలకు పని చేశారు. ఇవన్నీ చేసి, పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం తపించిన వ్యక్తి వెంకట రమణ గారు. ఇవన్నీ చేసిన వ్యక్తి ఈరోజు మరణించడం పట్ల చాలా బాధ కలుగుతుంది. ఏదేమైనా ఒక్కొక్కసారి జీవితంలో విధి నిర్ణయాన్ని ఎవరం కాదనలేము. వారి మరణం ఇటు పార్టీకి అటు తిరుపతి ప్రజానీకానికి చాలా నష్టం. ఏదేమైనా ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ప్రత్యేకంగా ఆయన భార్యకి నా ప్రత్యేక సానుభూతిని తెలియజేస్తున్నాను. అదే మాదిరిగా ఆమె ధైర్యంగా ఉండి వాళ్ల పిల్లల భవిష్యత్తే కాకుండా ఏవైతే ఆశయాల కోసం వెంకటరమణ గారు పోరాడారో ఆ ఆశయల సాధన కోసం ఆమె కూడా ముందుకు పోయే విధంగా భగవంతుడు అన్ని విధాలా ధైర్యాన్ని సాహసాన్ని ఆమెకు ఇవ్వాలని మనస్ఫూర్తిగా ఆశిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బొండా ఉమామహేశ్వరరావు (విజయవాడ-సెంట్రల్) : అధ్యక్షా, తిరుపతి శాసన సభ్యులు శ్రీ వెంకట రమణ గారి మృతి చాలా తీరని లోటు. 1990వ సంవత్సరం నుంచి 10 సంవత్సరాల పాటు నేను కూడా తిరుపతిలో ఉన్నాను. అత్యంత సన్నిహితంగా ఆయనతో ఉండేవాళ్లం. దగ్గరగా ఆయనను గమనించేవాళ్లం. ఆయన ఒక కౌన్సిలర్‌గా గెలిచి, గత శాసనసభలో ఒక ఎమ్మెల్యేగా పని చేసి, మరలా ఇప్పుడు ఈ శాసనసభా ఎన్నికల్లో కూడా అత్యధిక మెజర్టీతో గెలిచి, సామాన్యుల కష్టాలను, సామాన్యుల సమస్యలను పరిష్కరించడంలో చాలా

ఓపికగా, తిరుపతి ప్రజల్లో ప్రతి కుటుంబంలో కూడా కుటుంబ సభ్యుడిగా ఉంటూ, ఆయన నాన్ కాంట్రవర్షియల్‌గా అందరి మన్ననలను పొందిన వ్యక్తి. అన్ని రాజకీయ పార్టీలతో సత్సంబంధాలను కలిగి ఉంటూ రాజకీయాలకు అతీతంగా ఆయన దగ్గరకు పని కొరకు ఎవరు వచ్చినా ఆ పనిని చేసి పెట్టడానికి కృషి చేసిన ఉత్తమమైన మనస్సున్న వ్యక్తి ఆయన. మొన్న జరిగిన సమావేశాల్లో కొంచెం అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా, బాగౌతుందని అన్ని విధాలా భావించి హఠాత్తుగా మొన్న కుప్పకూలిపోవడం, తర్వాత రికవరీ అవుతారని అనుకోవడం, హఠాత్తుగా వారు మరణించడం అటు తిరుపతి ప్రజలకు ఇటు రాజకీయ పార్టీలకు, నియోజక వర్గ ప్రజలకు తీరని లోటుగా భావిస్తూ ఆయనకి ప్రగాఢ సంతాపాన్ని ఈ సభ ద్వారా తెలియజేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అందరూ కూడా ప్రార్థించాలని కోరుతూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఈ సభ ద్వారా కోరుకొంటున్నాను.

శ్రీ చెవిరెడ్డి భాస్కరరెడ్డి (చంద్రగిరి) : అధ్యక్షా, తిరుపతి శాసన సభ్యులు శ్రీ వెంకట రమణ గారితో నాకు వ్యక్తి గతంగా చాలా దగ్గరి సంబంధాలు ఉన్నాయి. నేను తుడా ఛైర్మన్‌గా టిటిడి ఎక్స్ అఫీషియో బోర్డు మెంబర్‌గా ఉన్నప్పుడు వారు ఎమ్మెల్యేగా ఉండే వారు. నేను ఎమ్మెల్యేగా ఉండేటప్పుడు వారు తుడా ఛైర్మన్‌గా టిటిడి ఎక్స్ అఫీషియో బోర్డు మెంబర్‌గా ఉండేవారు. ఇదే కాకుండా గతంలో 20 సంవత్సరాలపాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు, కలిసి దగ్గరగా పని చేసిన వాళ్లం. వారు నిజంగా కూడా మంచి వెంకటేశ్వర స్వామి భక్తులు. టిటిడికి కూడా అనేక విరాళాలను అందజేసిన వ్యక్తి. వారిని దగ్గరగా 20 సంవత్సరాల పాటు చూసిన వ్యక్తిని. సమైఖ్యాంధ్రా ఉద్యమంలో చాలా చురుకుగా పాల్గొన్న వ్యక్తుల్లో ఆయన కూడా ఒకరు. ఆ ఉద్యమంలో పాల్గొంటున్న సమయంలో ఒకసారి ఒక సంఘటన జరిగింది. ఆ సంఘటన ఇప్పటికీ నాకు జ్ఞాపకం ఉంది. ఆ ఉద్యమం భాగంగా వారు తెలుగు తల్లి విగ్రహానికి ఒక పూల మాల వేయాల్సి ఉంది. అయితే కొంచెం నీరసంగా ఉందని లేవలేక వారు కారులో కూర్చుండిపోయారు. వెంటనే డాక్టర్లు పరిగెత్తుకుంటూ వచ్చి మీరు లేవలేకపోతున్నారు పైకి వెళ్లొద్దని అంటే ఒక రెండు నిమిషాలు రెస్ట్ తీసుకొని మరలా పైకి ఎక్కుతానంటూ రెండు నిమిషాలు కారులో రెస్ట్ తీసుకున్న తర్వాత పైకి వెళ్లి తెలుగుతల్లి విగ్రహానికి పూల మాల వేయడానికి ప్రయత్నించిన వ్యక్తి. అది ఒక్కటే కాదు, చక్కటి గ్రామీణ భాషతో వచ్చిన వారిని రావయ్యా ఏంటయ్యా అంటూ ఆప్యాయంగా పలకరించిన వ్యక్తి. ఇంటికి ఎవరు వచ్చినా, శత్రువు వచ్చినా కూడా వస్తూనే కాఫీ త్రాగావా, టీ త్రాగావా కూర్చోండి అంటూ గౌరవించిన వ్యక్తి. వారు అన్ని పార్టీలతో కూడా సత్సంబంధాలను కలిగి, ప్రజలకు దగ్గరగా ఉన్న వ్యక్తి. నిజంగా వారు అభిమానం ఆత్మీయతకు నిదర్శనం అనవచ్చు. అంతకన్నా మించి అజాత శత్రువు అనవచ్చు. దానికి ఒక చిన్న నిదర్శనం ఉంది. మొన్న జరిగిన ఎన్నికల్లో కరుణాకరరెడ్డి గారి పైన వెంకట రమణ గారు గెలవడం జరిగింది. అయితే ఆయన అజాత శత్రువు అనడానికి ఒక నిదర్శనం ఏమంటే, అదే కరుణాకరరెడ్డి గారు తను చనిపోతే తన పాడెను స్మశాన వాటిక వరకు మోశారు. అంటే తను ఎంత అజాత శత్రువో గమనించాల్సిందిగా కోరుతున్నాను. అటువంటి అందరి

వాడిగా, అందరి కోసం పని చేసిన వ్యక్తిగా మంచి పేరును తెచ్చుకున్న వెంకట రమణ గారు ఈ రోజున లేకపోవడం బాధాకరం. వారి ఆత్మ శాంతి కోసం, వారి కుటుంబానికి అన్ని విధాలుగా మేలు జరగాలని ఆ భగవంతుండ్ని ప్రార్థిస్తు వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ పల్లె రఘునాథరెడ్డి (పుట్టపర్తి) : అధ్యక్షా, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రం తిరుపతి నియోజకవర్గ శాసన సభ్యులు గౌరవనీయుడు వెంకట రమణ గారు మరణించడం చాలా బాధాకరం. చాలా విచారకరం. ఆయన మరణం తెలుగుదేశం పార్టీకీ, ముఖ్యంగా తిరుపతి నియోజక వర్గానికి తీరని లోటని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. అతి సాధారణమైన కుటుంబంలో జన్మించిన వెంకట రమణ గారు, వారి కృషి, పట్టుదల, చిత్తశుద్ధి వలన అంచెలంచెలుగా ఎదిగారు. అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. తిరుపతి శాసన సభ్యునిగా రెండవసారి కూడా ఎన్నికైయ్యారు. ఆయన మున్సిపల్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్‌గా శాసన సభ్యుడిగా, తుడా ఛైర్మన్‌గా, ఏ పదవిని చేపట్టినా అత్యంత సమర్థవంతంగా నిర్వహించారు. అందరి మన్ననలను చూరగొన్నారు. ఆయనతో నాకు సన్నిహిత సంబంధం ఉంది. నేను తిరుపతికి రెండుమూడు సార్లు మంత్రిగా విజిట్ చేసినప్పుడు, ఆయన అడిగిన మొదటి ప్రశ్న ఇక్కడ ఇన్‌క్యుబేషన్ సెంటర్‌ను ఎప్పుడు ఏర్పాటు చేస్తారు, దీనిని ఐటీ ప్రాంతంగా ఐటీఐఆర్ రీజన్‌గా మార్చాలి, చాలా మందికి ఉద్యోగాలను ఇవ్వాలని ఆయన చూపించిన ఆతృత, ఆసక్తి నిజంగా చాలా గొప్పది.

అంతేకాకుండా ఆయన చాలా నిరాడంబరుడు, మృదుస్వభావి, అందరితో కలిసిమెలసి పోవాలనే ఆలోచన, చిన్న పిల్లల్లో చిన్న వానిగా, పెద్ద వాళ్లలో పెద్ద వానిగా అందరితో కలిసిమెలసి తలలో నాలుక మాదిరిగా వ్యవహరించేవారని అక్కడి ప్రజలు చెప్పుకునే వారు. మంచి అభిమానాన్ని చూరగొన్నారు. తిరుపతిని అభివృద్ధి చేయాలనే ఆలోచన, తపన, ఉద్దేశం, లక్ష్యం అనువనువునా ఆయనలో కనిపించింది. ఎన్నికైన ఆరు నెలల లోపే మరణించడం, ఆ కుటుంబ సభ్యులకు చాలా తీరని లోటు, ఆ తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆయన ఆత్మకు శాంతిని కలుగజేయాలని, ఆయన మరణం వలన కలిగిన దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ఆ కుటుంబ సభ్యులకు కలుగజేయాలని మనస్పూర్తిగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ చింతల రామచంద్రారెడ్డి (పీలేరు) : అధ్యక్షా, ఈ యొక్క శాసన సభ్యుడికి సంతాపాన్ని తెలియజేసే సందర్భంలో గౌరవ ప్రతిపక్ష నాయకుడికి అవకాశం ఇవ్వడం సాంప్రదాయం. మొదట ముఖ్యమంత్రి గారు మాట్లాడారు తర్వాత ప్రతిపక్ష నాయకులు మాట్లాడితే బాగుంటుంది.

మిస్టర్ స్పీకర్ : కరక్టే.

శ్రీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ః అది సాంప్రదాయం అధ్యక్ష. (మైక్ పర్మిషన్ లేకుండా)

(అంతరాయం)

మిస్టర్ స్పీకర్ ః రామచంద్రారెడ్డి గారు, భాస్కర్‌రెడ్డి గారు దయచేసి వినండి. Don't create controversy unnecessarily. నేను అటు ఇటు అన్నీ చూస్తున్నాను. లీడర్ ఆఫ్ ది హౌస్ మాట్లాడిన తర్వాత, I was looking at the Leader of Opposition.

(అంతరాయం)

...

(వైఎస్ఆర్ పార్టీ సభ్యులు సర్వశ్రీ జ్యోతుల నెహ్రూ, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తమ స్థానం నుండి లేచి నిలుచున్నారు.)

( శ్రీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిః (మైక్ లేకుండా) లీడర్ ఆఫ్ ది హౌస్‌కి మాట్లాడే అవకాశం ఇచ్చిన తర్వాత లీడర్ ఆఫ్ ది అపోజిషన్‌కి అవకాశం ఇవ్వాలి కదా! అది సాంప్రదాయం సార్ అన్నారు )

మిస్టర్ స్పీకర్ ః సాంప్రదాయమంటే అడగకుండా తీసుకుంటారా?

(శ్రీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిః (మైక్ లేకుండా) సంప్రదాయాన్ని పాటించమని అడుగుతున్నాము సార్ అన్నారు.)

మిస్టర్ స్పీకర్ ః భాస్కరరెడ్డి గారు, దయచేసి కూర్చోండి చెబుతాను. Kindly don't make an issue out of this. Leader of the Opposition gets priority after the Leader of the House. అడిగితే ఎందుకు అవకాశం ఇవ్వమండి? దయచేసి కూర్చోండి. రామచంద్రారెడ్డి గారు మాట్లాడండి. Leader of the Opposition will get priority after Leader of the House. I am prepared to give him an opportunity. నేను అందరివైపు చూస్తున్నాను. నెహ్రూ గారు, సంతాప తీర్మానాన్ని దయచేసి వివాదం చేయవద్దు, కూర్చొండి. మీరు మాట్లాడే ముందు ఈ విషయం అడగొచ్చు కదా. మీ అందరికి మాట్లాడేందుకు అవకాశం ఇస్తూ వారికి ఇవ్వమా? నేను వారివైపు నాలుగైదు సార్లు చూశాను. దయచేసి కూర్చోండి. జగన్మోహన్ రెడ్డి గారు మాట్లాడండి.

శ్రీ వైఎస్.జగన్మోహన్ రెడ్డి(పులివెందుల) ః అధ్యక్షా, మొట్టమొదటి రోజున నిజంగా ఈ శాసనసభలో ప్రతిపక్షాన్ని కించపరిచే విధంగా కావాలని మీరు చేస్తున్న తీరును చూస్తే బాధాకరం.

( ఈ దశలో అధికారపక్ష సభ్యులచే అంతరాయం )

MR.SPEAKER: I am sorry. You are creating controversy over the Condolence Motion. It is not fair on your part. మీకు తప్పకుండా అవకాశం వస్తుంది.

శ్రీ వైఎస్.జగన్మోహన్ రెడ్డి(పులివెందుల): మొట్టమొదటగా ముఖ్యమంత్రిగారు మాట్లాడిన తరువాత మీరు మాట్లాడుతారా అని గతంలో రెండు మూడు సందర్భాలల్లో మీరు నోరు తెరచి అడిగారు. ఈరోజు ఎందుకు అడగలేదు. అడగకపోగా మా ఎంఎల్ఏ శ్రీనివాస్ వచ్చి సెక్రటరీ గారిని అడిగిన తరువాత కూడా కించపర్చాలనే ఒకే ఒక్క ఉద్దేశ్యంతో మైకు ఇవ్వలేదు. నేను ఒకటే చెబుతున్నాను ఆంధ్రరాష్ట్రం విడిపోయిన తరువాత శాసనసభ స్పీకర్‌గా మీరు ఉన్నారు. ఇటువంటి సంప్రదాయాలనే కాల రాస్తే; ఎల్లకాలం ఇలా జరుగదు. ఈరోజు వారు అధికారంలో ఉండగా, రేపు మేము అధికారంలోకి వస్తాము.

(ఈ దశలో అధికారపక్షం నుండి అభ్యంతరం)

ఆరోజు వారి పరిస్థితి కూడా ఇలాగే ఉంటుంది. స్పీకర్ చైర్‌లో కూర్చొని ఉన్నప్పుడు సంప్రదాయాలను మనం కచ్చితంగా పాటించాలనేది మనసులో పెట్టుకోవాలి.

MR.SPEAKER: Jaganmohan Reddy Garu, you have made wild allegations against the Chair. మనలో నిన్నటి వరకు ఉన్న ఒక సభ్యుడు ఈరోజు లేరు. అనుకోకుండా జరిగిన వారి మరణం పట్ల ఈరోజు సభలో సంతాపతీర్మానం పెట్టాము. నా బాధ్యత నాకు తెలుసు. ఎప్పుడూ కూడా Leader of the House మాట్లాడిన తరువాత Leader of the Oopposition will get priority. నేను మీ వైపు నాలుగు ఐదు సార్లు చూశాను.

(ఈ దశలో వైఎస్ఆర్ పార్టీ సభ్యులచే అంతరాయం)

దయచేసి వినండి, I sincerely appeal to you. Please sit down. ఈ సంతాప తీర్మానం మీద మీ సభ్యులు భాస్కరరెడ్డి గారిది తిరుపతి నేటివ్ కాబట్టి భాస్కరరెడ్డి గారిచేత మాట్లాడిస్తున్నారని అనుకున్నాను. మీరు రెండవ ప్రయారిటీ తీసుకొని మాట్లాడండి. మీరు మాట్లాడకపోతే నేనేమి చేయను. నేను బలవంతంగా మాట్లాడించలేను కదా? ఇప్పుడు మీరు మాట్లాడండి. రామచంద్రారెడ్డి గారు ఈ విషయం లేవనెత్తారు. భాస్కరరెడ్డి గారు మాట్లాడినప్పుడు ఎందుకు ఆ విషయం లేవనెత్త లేదు. వారు మా లీడర్ మాట్లాడేందుకు

అవకాశం ఇవ్వాలని చెప్పాలి కదా? మీరు మాట్లాడేందుకు స్లిప్స్ పంపిస్తున్నారు. అందరికి మాట్లాడే అవకాశం ఇస్తున్నాం. దయచేసి దీనిని వివాదం చేయవద్దు.

(ఈ దశలో శ్రీ కె.అచ్చెన్నాయుడు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాల్సిందిగా కోరుతూ తమ స్థానం నుండి లేచి నిలుచున్నారు.)

దయచేసి కూర్చోండి. There should not be any controversy on this issue. Yes, Jaganmohan Reddy Garu.

శ్రీ వైఎస్.జగన్మోహన్ రెడ్డి(పులివెందుల) : అధ్యక్షా, తిరుపతి శాసనసభ్యులు వెంకటరమణ గారు 2004సం.లో మానాన్న గారు డా.వైఎస్.రాజశేఖరరెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ ఎంఎల్ఏగా అప్పట్లో ఎన్నికయ్యారు. వారి కార్పోరేటర్ స్థాయి నుండి ఎంఎల్ఏ స్థాయి వరకు వారికి మా కుటుంబంతో సన్నిహిత సంబంధం ఉంది. అటువంటి వ్యక్తి మరణం నిజంగా బాధాకరం. బాధ ఎక్కడ అనిపించిందంటే, మొన్న అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు మనందరికీ కనిపించారు. ఆరోజు కూడా తన ఆరోగ్య పరిస్థితి ఏమాత్రం బాగా లేదు. ఒక సందర్భంలో కాస్త తూలిన పరిస్థితి మనందరికీ తెలుసు.

ఆరోగ్యం బాగాలేని పరిస్థితుల్లో సింగపూర్‌కు వెళ్లి వైద్యం చేయించుకోవాలని తాను ఆరాటపడడం, ఆ విషయాన్ని ముఖ్యమంత్రి గారికి చెప్పడం, ముఖ్యమంత్రి గారేమో ప్రైవేట్ ఫ్లైట్‌లో కార్పోరేట్ వ్యక్తులతోపాటు సింగపూర్‌కు వెళ్లే ఆసక్తి చూపించినప్పుడు ఆదే ఫ్లైట్‌లో రమణ గారిని కూడా సింగపూర్‌కు తీసుకెళ్లి వైద్యం చేయించి ఉంటే రమణ గారి గురించి ఈనాడు మాట్లాడుకోవల్సిన అవసరం ఉండేది కాదు. అయినప్పటికీ విధిని ఎవరూ మార్చలేరు. వారి మరణం నిజంగా బాధాకరం. వెంకట రమణ గారికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పిల్లలను పెంచడానికి ఆ తల్లి ఎంత అవస్థలు పడి ఉంటుందో. నాన్న గారి హయాంలో కాంగ్రెస్ ఎంఎల్ఏ గా వారు ఎన్నికయినప్పుడు చూశాం. కాబట్టి కాస్తో, కూస్తో వారి గురించి తెలుసు. అటువంటి కుటుంబానికి మంచి జరగాలని, దేవుడు ఆ కుటుంబాన్ని మనస్పూర్తిగా ఆశీర్వదించాలనీ, ఆ కుటుంబానికి మా తరఫున కూడా ఎల్లవేళలా మా సహాయ సహకారాలుంటాయని సభాముఖంగా తెలియజేసుకుంటున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేసుకుంటున్నాను.

శ్రీ కె.శ్రీనివాసులు(కోడూరు) : అధ్యక్షా, తిరుపతి ఎంఎల్ఏ వెంకటరమణ గారు చనిపోవడం ముఖ్యంగా కళాకారులకు, నాతోటి శాసనసభ్యులందరకు చాలా తీవ్రమైన మనస్థాపానికి గురిచేసింది. వ్యక్తిగతంగా తిరుపతి ఎంఎల్ఏ నాకు 1994 సంవత్సరం నుండి పరిచయమే. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఆయనతోపాటు మున్సిపల్ ఎన్నికల్లో మేము

ప్రచారం చేయడం జరిగింది. అదేవిధంగా ఆయనతోపాటు 2004వ సంవత్సరంలో మేము యూనివర్సిటీలో ఉన్నాం, అప్పటి నుండి వారితోపాటు ఎన్నికల్లో ప్రచారం చేయడం కూడా జరిగింది. వారు అనారోగ్యంతో స్విమ్స్ హాస్పిటల్‌లో చేరినప్పుడు మేము వెళ్లి పరామర్శించాము.

...

అటువంటి వ్యక్తి చికిత్స కోసం చెన్నై అపోలో హాస్పిటల్‌కు వెళ్ళి, చికిత్స అనంతరం శరీరం సహకరించక పోవడంతో మృతి చెందడం చాలా బాధాకరమైన విషయం. ఏది ఏమైనప్పటికీ ఆయనకూ, ఆయన కుటుంబానికీ ఆత్మశాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ సెలవుతీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః గొల్లపల్లి సూర్యారావు గారు.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు)ః స్పీకర్ సర్, నిన్న మొన్నటి వరకు ఎలాంటి కార్యక్రమమైనా మనందరితో కలిసి, మనందరినీ కలుపుకుని ముందుకువెళ్ళే మనస్తత్వం గల శ్రీ ఎం.వెంకటరమణ గారితో ఏ కొద్ది సమయం గడిపినా, మనల్ని ఒక గొప్ప అనుభూతిలోనికి తీసుకువెళ్ళే మంచి మహనీయత కలిగినటువంటి వ్యక్తి. అటువంటి మానవతావాది ఈ సభలో లేకపోవడం చాలా బాధాకరం. శ్రీ వెంకటరమణ గారు 2004వ సంవత్సరం నుంచి నాకు ఒక మంచి స్నేహితులుగా, ఆప్తులుగా ఉండేవారు. మా ఇద్దరి మధ్య ఉన్నటువంటి ఆత్మీయతను నేను మరిచిపోలేకున్నాను. 2004వ సంవత్సరంలో, వారు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు, రాయలసీమ ప్రాంతంలో శ్రీ వెంకటరమణ గారి సామాజికవర్గంలో ఎవ్వరికీ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో సీటు ఇవ్వకపోతే, శ్రీ దాసరి నారాయణరావుగారు, ఆనాటి కాంగ్రెస్‌పార్టీ జాతీయనాయకులతో వాగ్వివాదమాడి, వెంకటరమణ గారికి సీటు ఇప్పించి, తద్వారా రాయలసీమ ప్రాంతంలో ఆ సామాజికవర్గానికి న్యాయం చేకూర్చినటువంటి సంగతి మనకు తెలుసు.

అలా మేము 2004-09 మధ్యకాలంలో మంచి స్నేహితులమయ్యాము. నాకు అనేక కష్టాలు, ఇబ్బందులు వచ్చినప్పుడు నన్ను ఓదార్చి, నాకు ధైర్యం చెప్పిన ఒక మంచి స్నేహితుడు. గంగ, కావేరి, తుంగభద్ర, కృష్ణ, గోదావరి వంటి పుణ్యనదుల నుండి జలాలను సేకరించి, తిరుపతి నగరంలో ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారినీ, రాజకీయంగా ఉన్న వేలాదిమందిని పిలిపించి, ఆ జలాలను తిరుపతి నగరమంతా వీధి, వీధిన చల్లించి, గొప్ప ఆధ్యాత్మికమైన ఆలోచనకి తిరుపతి ప్రజలందరినీ తీసుకెళ్ళిన గొప్ప ఆధ్యాత్మికవేత్త వారు. 2004వ సంవత్సరంలో ఎన్నికల్లో నేను గెలిచిన వెంటనే తిరుపతి నియోజకవర్గ కార్యకర్తలు, ఆనాటి నా నియోజకవర్గమైన అమలాపురం కార్యకర్తలందరికీ, అప్పటి రాజధానిలో ఒక రాత్రి భోజనం ఏర్పాటుచేశారు. 2014 సంవత్సరం ఎన్నికల్లో కూడా అనుకోకుండా వారు ఇదేవిధంగా, నాతోపాటు ఉన్న రాజోలు నియోజకవర్గ కార్యకర్తలకు, వారితోపాటు వచ్చిన వారి కార్యకర్తలకు,

సుమారు 120-130 మందికి భోజనాలు పెట్టించినటువంటి మంచి వ్యక్తి ఆయన. ఆ సందర్భాన్ని నేను ఎన్నటికీ మరువలేను. ఒక గొప్ప మానవీయత కలిగినటువంటి మహానుభావుడు, బీదల పట్ల కనికరము, జాలి కలిగినటువంటి వ్యక్తి ఆయన. అటువంటి వ్యక్తి ఈరోజు లేకపోవడం నాకు చాలా బాధ కలుగుతోంది.

ఏ ప్రాంతం వాళ్ళమైనా, ఎక్కడివాళ్ళమైనా, ఏ సామాజిక నేపథ్యం ఉన్నప్పటికీ, ఈ రాజకీయ వ్యవస్థ మమ్మల్ని బంధువులుగా, ఆత్మీయులుగా చేసింది. మొన్ననే వెంకటరమణగారు చాలా అనారోగ్యంతో బాధపడుతూ వుంటే, మంచి ఆసుపత్రిలో చూపించుకోమని చెప్పాను. ఆసుపత్రిలో చూపిస్తున్నానంటూ ఆరోజు వారు మాట్లాడిన తీరు చూస్తే, వారు చాలా ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నారనిపించింది. ఇంత త్వరలోనే వారికి మరణం సంభవిస్తుందని నేను ఊహించనేలేదు. వారు చాలా మంచి నటులు. ఆంధ్రప్రాంతంలోని మన తెలుగుప్రజలు వారిని ఎప్పటికీ మరిచిపోలేనటువంటి మహోన్నతమైన నాటకీయ జీవితం కూడా వారిలో మిళితమైనటువంటి గొప్ప నాయకుడు. ఆయన ఈరోజు ఈసభలో లేకపోవడం వలన, ఈ సభ యొక్క హుందాతనం కొద్దిగా తగ్గిందనుకుంటున్నాను.

ఒక గొప్ప ప్రజాస్వామ్యవాదిగా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ, సభాపతి స్థానంలో ఉన్న తమరిలాంటివారి నేతృత్వంలో, ఈ సభలో లేకపోయినా కానరానటువంటి లోకాల్లో ఉన్నటువంటి మహానుభావుల్ని స్మరించుకునే ఇటువంటి సందర్భాల్లో, సభను దారితప్పించే పరిస్థితులు ఎవరూ తీసుకురాకూడదని నా సోదర సభ్యులందరికీ మనవి చేస్తున్నాను. శ్రీ వెంకటరమణ గారి ఆత్మశాంతించాలనీ, వారి భార్యాబిడ్డలు భూలోకంలో జీవించినంతకాలం తండ్రిలేడనే బాధ కలుగకుండ వారిని చల్లగా చూడాలని, వారికి మనోధైర్యాన్ని కలుగజేయాలని ఆ పరమేశ్వరుణ్ణి, తిరుపతి వెంకటేశ్వర స్వామి వారిని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః విష్ణుకుమార్ రాజు గారు.

శ్రీ పి.విష్ణుకుమార్ రాజు (విశాఖపట్నం-నార్త్)ః అధ్యక్షా, తిరుపతి శాసనసభ్యులు శ్రీ ఎం.వెంకటరమణ, ఎస్ఎస్ఎల్సీ దాకా చదువుకున్నప్పటికీ, ఆయన మంచి 'మాస్ లీడర్' గా ప్రఖ్యాతిగాంచారు. 2004వ సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో సుమారు 47,000 ఓట్లతో ఆధిక్యంతో గెలుపొందారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో కూడా 41,000 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ప్రజలకు ఆయనంటే ఎంత అభిమానం, ఆప్యాయత ఉన్నాయో తెలపడానికి ఈ ఎన్నికల ఓట్లే ఒక నిదర్శనం. అటువంటి వ్యక్తి ఈ శాసనసభలో మనందరికీ దూరం కావడం చాలా దురదృష్టకరం. వారి కుటుంబ సభ్యులకు పూర్తి సహాయసహకారాలు తెలుగుదేశం పార్టీ,

ప్రభుత్వం అందించాలని కోరుతున్నాను. వారి కుటుంబానికి, స్నేహితులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః సత్యప్రభ గారు.

శ్రీమతి డి.ఎ.సత్యప్రభ (చిత్తూరు)ః అధ్యక్షా, శాసనసభ్యులు శ్రీ ఎం.వెంకటరమణ గారు లేరన్నది తీరని లోటు. మానవత్వం కలిగిన మంచి వ్యక్తిగా అందరితో మసలేవారు. అతి బీదకుటుంబంలో జన్మించి, ఆ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు కష్టపడి పైకివచ్చిన వ్యక్తి. 2004, 2014 ఎన్నికలలో పోటీ చేసి 40,000కు ఓట్లకుపైగా మెజారిటీతో గెలుపొంది, ప్రజాదరణ కలిగిన మనిషి, మన గుండెలలో చిరకాలం నిలిచిపోయే వ్యక్తి. ఆయన దగ్గరకు వెళ్ళినవారిని ఆత్మబంధువుగా ఆదరించి, వారికి కావలసిన తిరుమల దర్శన ఏర్పాట్లు, వసతులు చేసేవారు. 'ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలి' అనే తత్వం తెలిసిన వ్యక్తి. ఎవరినైనా పలకరించేటప్పుడు సంస్కారంగా, మృదుత్వంతో, సరళంగా మాట్లాడే వ్యక్తిని కోల్పోవడం చాలా దురదృష్టకరం. ఆయన జీవించి ఉంటే తిరుపతి నియోజకవర్గంలోని బడుగు, బలహీనవర్గాలకు చాలా ఉపయోగపడే వ్యక్తి. ఎప్పుడూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కొరకు తపించేవారు. తిరుపతిలో, చిత్తూరులో బడుగు, బలహీనవర్గాల కోసం వసతి గృహాలను నిర్మించాలని, త్రాగునీరును అందించాలనుకొనేవారు. రుయా, స్విమ్స్ వైద్యశాలలో సదుపాయాలను మెరుగుపరచాలని, వాటిని అభివృద్ధి చేయాలని తపన పడేవారు. ఆయన సతీమణి శ్రీమతి సుగుణ కూడా మన హిందూ సంప్రదాయం కలిగి, తల్లి ప్రేమకు మారుపేరుగా తమ మూగపిల్లలను పెంచి, ఆ మూగపిల్లలు, పిల్లలుగల తల్లులుగా నిలవడానికి, శ్రీ వెంకటరమణ గారు ఈ స్థాయికి ఎదగడానికి శ్రీమతి సుగుణ ఎంతో ముఖ్యపాత్ర పోషించింది. ఆ ఏడుకొండలవాడు వారి కుటుంబానికి మంచిని, మనశ్శాంతిని ప్రసాదించాలని, ఆ భగవంతున్ని మనఃపూర్వకంగా ప్రార్థిస్తున్నాను.

...

శ్రీ దేశాయి తిప్పారెడ్డి (మదనపల్లి)ః అధ్యక్షా, నిగర్వి, నిరాడంబరుడు, ప్రజల మనిషి తిరుపతి నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ వెంకటరమణ గారి అకాల మరణం మాకు తీరని వేదనను కలిగించింది. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజా మనిషిగా ఆయన పేరు తెచ్చుకున్నాడు. అతని దగ్గర ఎవరైనా సహాయం కోసం వెళ్ళినపుడు కోపం గాని అహం గాని లేని, ఎప్పుడూ అందరితో కలిసిమెలసి ఉండే వ్యక్తి, జాలి హృదయం కలిగిన మనిషి. ప్రజా సమస్యలపై 20 సంవత్సరాలుగా పోరాడుతూ, అంచెలంచెలుగా ఎదిగి ఎమ్మెల్యే స్థాయికి వచ్చారు. ఈ శాసనసభలో ఐదు సంవత్సరాల కాలం పూర్తిచేయాల్సిన వ్యక్తి అర్థాంతరంగా చనిపోవడం అందరికీ తీరని లోటు. 2004వ సంవత్సరం నుండి వారితో నాకు చాలా దగ్గరి అనుబంధం ఉంది. నేను పనిమీద తిరుపతి వెళ్ళాలనుకున్నప్పుడు ఆయన సహాయం తీసుకొనే వాడిని. ఆయనకు ఫోన్ చేసినపుడు what can I do for you, ఏమి సహాయం కావాలని అడిగే

మంచి వ్యక్తి. ఏలాంటి సహాయమైనా చేసేవారు. అలాంటి వ్యక్తిని ఆకస్మికంగా కోల్పోవడం చాలా బాధాకరం, అందరికీ తీరనిలోటు. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, ఆయన ఆత్మకు శాంతి కలగాని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

శ్రీ పెద్దిరెడ్డిగారి రామచంద్రారెడ్డి (పుంగనూరు)ః అధ్యక్షా, శ్రీ వెంకటరమణ గారు మా ప్రాంతం నుంచి వచ్చి తిరుపతిలో స్థిరపడి కౌన్సిలర్ స్థాయి నుంచి అంచెలంచెలుగా రాజకీయాలలో ఎదిగారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా నేను పనిచేస్తున్నప్పుడు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షునిగా నాతోపాటు చాలా కాలం పనిచేశారు. 2004వ సంవత్సరంలో శాసనసభ్యునిగా ఎన్నికైన తరువాత కూడా ప్రజాహిత కార్యక్రమాలలో నాతోపాటు కలిసి పనిచేశారు. గత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసి మరలా శాసనసభకు ఎన్నిక కావడం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. శాసనసభకు ఎన్నికై కొన్ని నెలలు కాకుండానే అయన ఆకస్మికంగా మృతి చెందడం, మాకు, తిరుపతి పట్టణవాసులకు, మా చిత్తూరు జిల్లాకు ఆ భగవంతుడు తీరని అన్యాయం చేశారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, భగవంతుడు వారి కుటుంబానికి తిరిగి రాజకీయ ప్రాచుర్యాన్ని ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నాను.

శ్రీ నిమ్మకాయల చిన రాజప్ప (పెద్దాపురం)ః అధ్యక్షా, తిరుపతి శాసనసభ్యులు శ్రీ వెంకటరమణ గారు మృతి చెందడం ఇటు తెలుగుదేశం పార్టీకి గాని, అటు తిరుపతి ప్రజలకు చాలా బాధాకరం. ఆయన సామాన్య వ్యక్తిగా మొదట సినీరంగంలో ప్రవేశించి, తరువాత ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో, కౌన్సిలర్‌గా, మునిసిపల్ వైస్ ఛైర్మన్‌గా, తూడా ఛైర్మన్‌గా, శాసనసభ్యునిగా ఎదిగారు. శాసనసభ్యునిగా ఎన్నికైన తరువాత ప్రజలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఉన్నారు. కాని ఆయన కోరిక తీరకుండానే మృతి చెందడం చాలా బాధాకరం. వారి కుటుంబానికి నా సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటు సెలవుతీసుకుంటున్నాను.

శ్రీమతి ఆర్.కె.రోజా (నగరి)ః అధ్యక్షా, తిరుపతి శాసనసభ్యులు శ్రీ వెంకటరమణ గారి మరణం తిరుపతి ప్రజలకే కాకుండా, వారి ఆత్మీయులందరికీ తీరని లోటు. వయస్సుతో, పార్టీలతో నిమిత్తం లేకుండా అందరితో చాలా సరదాగా ఉంటూ, ఎవరు ఏ సహాయం అడిగినా కాదనకుండా, లేదనకుండా పని చేసే మంచి వ్యక్తిగా ప్రతి ఒక్కరి మన్ననలు పొందారు. లోక్‌సభ సభ్యులు శ్రీ శివప్రసాద్, శ్రీ వెంకటరమణ గార్లు నా తండ్రి స్నేహితులు. అలా శ్రీ వెంకటరమణ గారు నా తండ్రి స్నేహితుడిగా నాకు పరిచయం. శ్రీ శివప్రసాద్ గారు నన్ను సినిమా రంగానికి పరిచయం చేసినపుడు శ్రీ వెంకటరమణ గారు నా కోఆర్టిస్ట్‌గా పరిచయం. నాకు ఆయన ఎప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ నేను ఎదగాలని కోరుకున్నారు. ఈ ఎన్నికలలో నేను గెలవడానికి వారి ఆశీస్సులున్నాయి. వారు 'లేరు' అన్న నిజాన్ని తట్టుకోలేకపోతున్నాను. వారికి దైవభక్తి, మంచితనం ఎక్కువ, కాని భగవంతుడు తొందరగా తీసుకొనివెళ్ళి అందరికీ తీరని

అన్యాయం చేశాడు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, ఆ లోటును తట్టుకొనే మనోధైర్యాన్ని వారి కుటుంబసభ్యులకు ప్రసాదించాలని భగవంతున్ని కోరుకుంటూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ కాలువ శ్రీనివాసులు(రాయదుర్గం): అధ్యక్షా, తిరుపతి శాసనసభ్యులు శ్రీ ఎం.వెంకటరమణ గారి అకాల మృతి తెలుగుదేశం పార్టీకీ, తిరుపతి ప్రజలకు తీరనిలోటు. సున్నితమైన మనస్తత్వం కలిగి 25 సంవత్సరాలుగా రాజకీయాలలో అజాతశత్రువుగా ఉంటూ, అందరి దగ్గర మంచిగా మెలిగే స్వభావం కలిగిన నాయకులు. వారికి బీసీలంటే చాలా ప్రేమ. ఆయన, నేను కలిసి అనేక బీసీ సభలలో పాల్గొన్నాం. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బీసీ సభలు పెట్టి బీసీలను చైతన్యం చేసేవారు. అలాంటి మంచి వ్యక్తి మన మధ్య లేకపోవడం దురదృష్టకరం, బాధాకరం. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో శ్రీ వెంకటరమణ గారి ఆశయాలు కొనసాగించడానికి, ఆయన వదలి వెళ్ళిన కార్యక్రమాలు పూర్తి చేయడానికి ఆయన సతీమణికి తగిన శక్తిని ప్రసాదించాలని, ఆయన కుటుంబానికి అన్ని రకాలుగా మేలు జరగాలని మనసారా ఆ భగవంతున్ని కోరుకుంటున్నాను.

శ్రీ కె.నారాయణస్వామి(గంగాధర నెల్లూరు): అధ్యక్షా, శ్రీ వెంకటరమణ గారి మృతి మా జిల్లా వాసులే కాదు, మేమందరం చాలా బాధపడుతున్నాం. ఆయన, నేను దాదాపు 30 సంవత్సరాలుగా చాలా సన్నిహితంగా ఉన్నాం. ఆయన నాకు ఆపద్బాంధవుడు. నేను సత్యవేడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దాదాపు 218 ఎకరాల మామిడి తోట అన్యాక్రాంతమైనపుడు, దాదాపు 35 సంవత్సరాలు తమిళనాడు వారు ఆక్రమించుకొని అనుభవిస్తుంటే, అప్పటి ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి దగ్గరకు పోయినపుడు శ్రీ వెంకటరమణ గారు కూడా నాతోపాటు వచ్చి, 'మానవ సేవే, మాధవ సేవ' అనే భావనతో మనం పనిచేయాలని, మన ఫల వృక్షాలు మనకే చెందాలని అన్నప్పుడు ఆ మాటలను నేను ఈ రోజుకూ మరచిపోలేను. వైఎస్సార్ పార్టీ తరపున నన్నూ, తెలుగుదేశం పార్టీ తరపున ఆయనను ఎస్సీ, ఎస్టీ సంఘం వారు సన్మానించినపుడు దాదాపు 218 ఎకరాల మామిడి తోటను పంచి ఇచ్చిన ఘనత శ్రీ నారాయణస్వామికి చెందిందని, బాగా పనిచేశాడని అన్నారు. ఆయనకు శత్రుత్వం, పగ, ఈర్ష్యా లేవు, 'ప్రేమ' అనే పదంతోనే వారందరికీ దగ్గరకు చేర్చుకున్నారు. ఆయన ఇంటికి ఎవరైనా వెళ్ళినపుడు ఎంతో ప్రేమ, ఆప్యాయతగా పలకరించేవారు. ఆయన మరణించినపుడు తిరుపతి వాస్తవ్యులే కాదు, వారి ఇంటి నుంచి నేను కూడా శ్మశానవాటికకు వెళ్లాను. శ్రీ వెంకటరమణ గారి మరణం తీరనిలోటని కొన్ని వేల మంది శ్మశానవాటికకు రావడం చూశాను.

ఆయనకు ఇద్దరు మూగ ఆడపిల్లలు. మగ సంతానం కోసం మీరు మరో పెళ్ళి చేసుకోండని నేను చెప్పినపుడు, నాకు ఆడపిల్లలైనా, మగపిల్లలైనా ఒక్కటే, నీకు ముగ్గురు ఆడపిల్లలున్నారని బాధపడవద్దని, వారు ఆడపిల్లలా, మూగవారా అని చూడకుండా పిల్లలను పెంచి పెద్దచేసి వారి భవిష్యత్తు బాగా ఉండేటట్లు చూడాలని అన్నారు. అలాంటి మంచి వ్యక్తి,

ఆపద్బాంధవుడు మరణించడం చాలా బాధాకరం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం ఇవ్వాలని ఆ భగవంతున్ని కోరుకుంటున్నాను.

...

శ్రీ కె.అచ్చెన్నాయుడు(టెక్కలి): అధ్యక్షా, తెలుగు దేశం పార్టీ నాయకుడు, తిరుపతి శాసనసభ్యులు శ్రీ మన్నేరు వెంకట రమణ గారి మృతి తిరుపతి పట్టణ ప్రజలకు, తెలుగు దేశం పార్టీకి, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటు. తెలుగు దేశం పార్టీ శాసన సభ్యులందరికీ ప్రతి రోజూ వెంకట రమణ గారు కనిపిస్తారు. మొన్న తెలుగు దేశం పార్టీ విజయం సాధించిన తరువాత చంద్రబాబు నాయుడు గారిని మా నాయకునిగా ఎన్నుకోవడానికి తిరుపతిలో సమావేశమయిన సందర్భంలో తిరుపతి శాసన సభ్యులుగా ప్రతి ఒకరికీ ఏడు కొండల స్వామి వారి ఫోటోను ఆ రోజున బహూకరించారు. అది ప్రతి ఒకరి ఇంట్లో వుంది. ఆ ఫోటోను ప్రతి రోజూ చూసేటప్పుడు వెంకట రమణ గారు ప్రతి ఒకరికీ గుర్తుకొస్తారు. 2004లో కూడా ఆయనను నాతో పాటు శాసన సభ్యునిగా చూశాను. రాజకీయ పార్టీలతోనూ, వ్యక్తులతోనూ సంబంధం లేకుండా ప్రతి ఒకరినీ ఆప్యాయతతో పలకరిస్తూ మీరు ఎప్పుడు తిరుపతి వచ్చినా నాకు ఫోన్ చేయండి మీకు అన్ని ఏర్పాట్లు చేస్తానని ప్రతి ఒకరికీ కోరినవన్నీ చేసిపెట్టే మనస్తత్వం కలిగిన వ్యక్తి వెంకట రమణ గారు.

ఆయన మంచి కళాకారులు కూడా. 2004 నుంచి 2009 వరకు ప్రతి బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగిన సందర్భంలో వారు అనేక హాస్య పాత్రలు పోషించి అందరికీ ఆనందం కలిగించిన వ్యక్తి. అలాంటి వ్యక్తి ఇంత త్వరగా చనిపోతారని అసలు ఊహించలేదు.

ఆయన మూత్ర పిండాల వ్యాధితో చాలా రోజుల నుంచి బాధ పడుతున్నప్పటికీ ఆరు మాసాల క్రితం తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రావటం, ఆయన శాసన సభ్యునిగా ఎన్నిక కావటం, ఆ తరువాత నిత్యం ప్రజలతో గడపడం వల్ల తన వైద్యం పట్ల కొంత నిర్లక్ష్యం వహించడం వలన ఆయనకు మరణం సంభవించింది. ఏదియేమైనా మనుషులం శాశ్వతం కాదు. బతికున్నప్పుడు ఏవైనా మంచి కార్యక్రమాలు చేసి పది మందికి సహాయపడి సమాజానికి మేలు చేసిన వ్యక్తులు చిరస్థాయిగా నిలిచిపోతారు. మన వెంకట రమణ గారు ఆ కోవకు చెందిన వ్యక్తి అని ఈ సందర్భంగా తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి కలిగించాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, ఆయన కుటుంబసభ్యులకు ఏ అవసరమొచ్చినా చంద్రబాబు నాయుడు గారు, తెలుగు దేశం పార్టీ పూర్తి స్థాయిలో సహకరించడం జరుగుతుందని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని మరో సారి ఆ భగవంతుణ్ణి కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సి. జగ్గి రెడ్డి (కొత్తపేట)ః  అధ్యక్షా, కీర్తి శేషులు వెంకట రమణ గారి మరణం ఈ సమాజానికి తీరని లోటు. 2004లో వారు నాతో పాటు శాసనసభ్యులుగా పని చేశారు. వారికి మంచి శాసనసభ్యులుగానే కాకుండా మంచి స్నేహశీలి అన్న పేరు కూడా వుంది. ముఖ్యంగా అటువైపున్న చిత్తూరు తదితర రాయలసీమ జిల్లాలలోనే కాకుండా మా తూర్పు గోదావరి జిల్లా, విశాఖపట్నం తదితర జిల్లాలలో కూడా అనేక మంది ఆయనకు సన్నిహితులున్నారు. ముఖ్యంగా ఏ చిన్న కార్యక్రమమైనా సరే దూరమని కూడా లెక్క చేయకుండా ప్రయాణం చేసి మా దగ్గరికి వచ్చి మా అందరితో కలిసి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న మంచి వ్యక్తి ఆయన. 2004 ఎన్నికలకు ముందు ఢిల్లీలో దాసరి నారాయణ రావు గారు నాకు ఆయనను పరిచయం చేశారు. వారు నేను కలిసి ఒకే రూంలో వుండడం జరిగింది. ఆ తరువాత అనేకసార్లు నేనూ వారు పార్టీ కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం జరిగింది. మా రావులపాలెం గ్రామంతో ఆయనకు ప్రత్యేక అనుబంధం వుంది.

కామత్ సుబ్బరాజు గారని ఆయన స్నేహితుడితో కలిసి రావులపాలెంలో అనేక కార్యక్రమాలు చేస్తుండేవారు. ఎప్పుడు కూడా స్నేహానికి విలువ యిచ్చే వ్యక్తిగా వెంకట రమణ గారు వుండే వారు. ఆయన శాసన సభ్యునిగా మొట్టమొదటి సారిగా ఎన్నికైనప్పట్నుంచి కూడా ఏడు కొండల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రసాదం సభలో అందరికీ తీసుకొచ్చి యిచ్చే సాంప్రదాయాన్ని మొదలుపెట్టారు. పార్టీలతో నిమిత్తం లేని వ్యక్తిగా, ఏదో వేవ్‌లో నెగ్గారన్న పద్ధతిలో కాకుండా తనకంటూ ఒక ప్రత్యేకతను తిరుపతి ప్రాంతంలో సంతరించుకున్న వ్యక్తి ఆయన. అలాంటి వెంకటరమణ గారు మన ముందు లేకపోవడం అన్నది మనకు, ఆయన కుటుంబానికి తీరని లోటు. ఆయన లేని లోటును ఆయన కుటుంబానికి మనం భర్తీ చేయలేము కాబట్టి ఆ భగవంతుడు ఆయన లేని లోటును తీర్చేందుకు అవసరమైన సహాయ సహకారాలను ఆ కుటుంబానికి అందించాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బొజ్జల గోపాల కృష్ణారెడ్డి (శ్రీకాళహస్తి)ః  అధ్యక్షా, వెంకట రమణ గారు అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించటం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన లేని లోటు తిరుపతి పట్టణానికే కాదు, తెలుగు దేశం పార్టీకే కాదు ఈ హౌస్‌కే కాదు అందరికీ తీరనిలోటు. ఐ లాస్ట్ మై పర్సనల్ ఫ్రెండ్. మేము అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నాం. ఆయన ఏదైనా మొదలుపెట్టేటప్పుడు కాని, మాట్లాడేటప్పుడు కాని ఓం శ్రీ వేంకటేశాయనమః అని మొదలు పెట్టేవారు. తెలుగుదేశం పార్టీలోకి రావాలన్న కోరిక ఆయనకు ఎప్పట్నుంచో వుంది. ఒకసారి ఏదో ఒక ఇష్యూలో వివేకానంద రెడ్డి గారు కొట్టారు. కాంగ్రెస్ పార్టీలో వుండడం తప్పు అని అప్పట్లో బాధ పడేవారు. ఆయన ఎప్పుడు కార్యకర్తలతో మాట్లాడినా నేను మైదా పిండి లాంటి వాణ్ణి. పూరి చేసుకున్నా, చపాతి చేసుకున్నా మీ ఇష్టం. మీకు కావలసిన విధంగా నన్ను మౌల్డ్ చేసుకోండి అని చెప్పేవారాయన. తిరుపతికి సంబంధించి నీటి విషయంలో కాని, రైళ్ల

విషయంలో కాని తిరుపతిలోని రూయా ఆసుపత్రి విషయంలో కాని ఎంతో కృషి చేశారు. రూయా ఆసుపత్రిని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని ఎంతో తపించారు. ఆయన ఇల్లు కూడా తిరుపతి రూయా ఆసుపత్రి పక్కనే వుంటుంది. ఆసుపత్రి పక్కనే వుంటారు కాబట్టి ఆ రోజున మొదటిసారి ఆరోగ్యం బాగా లేకపోతే వెంటనే రూయా ఆసుపత్రికి తీసికెళ్లగానే డయాలసిస్ చేయడం వలన బతికారు. తదనంతర కాలంలో ఆయన డయాలసిస్ చేసుకోవడానికి భయపడి చేసుకోలేకపోయారు. ఆయన మరణం వల్ల ఆయన కుటుంబానికి కలిగిన లోటును తీర్చడానికి ఆ భగవంతుడు ఆయన కుటుంబసభ్యులకు అవసరమైన మానసిక స్థైర్యాన్నివ్వాలని, ఆయన ఆత్మకు శాంతి కలిగించాలని, ఆయన బతికుండగా తిరుపతి ప్రజలకు ఆయన చేయాలనుకున్న సేవలు రాబోయే ఉప ఎన్నికలో ఆయన భార్యను అందరూ ఏకతాటిమీద నిలబడి గెలిపించడం ద్వారా ఆయన భార్య ఆ సేవలను కొనసాగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సభ ద్వారా నేను అందరికీ విజ్ఞప్తి చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః శ్రీ మన్నేరు వెంకట రమణ 1947వ సంవత్సరం మార్చి ఒకటవ తేదీన తిరుపతిలో శ్రీ హనుమంతయ్య, శ్రీమతి వెంకటమ్మ దంపతులకు జన్మించారు. ఎస్ఎస్ఎల్సి వరకు చదువుకున్నారు. రాజకీయ ప్రస్థానాన్ని కౌన్సిలర్ స్థాయి నుండి మొదలు పెట్టిన శ్రీ వెంకట రమణ 1982 -1992 మధ్య కాలంలో తిరుపతి పురపాలక సంఘం కౌన్సిలర్గా మరియు వైస్ చైర్మన్గా కూడా తన బాధ్యతలు నిర్వర్తించారు. శ్రీ వెంకట రమణ 2004 మరియు 2014 సంవత్సరాలలో తిరుపతి నియోజకవర్గం నుంచి శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరు తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అధ్యక్షులుగా కూడా పని చేశారు. కళలపై మక్కువ కలిగిన శ్రీ వెంకట రమణ పలు సినిమాలలో నటించారు. అజాత శత్రువుగా, అందరివాడుగా గుర్తించబడిన శ్రీ మన్నేరు వెంకట రమణ 2014 డిసెంబరు 15వ తేదీన మరణించారు. మరణించడానికి ముందు చెన్నైలో ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్కు ముందు తీవ్ర అస్వస్థతకు లోనై స్విమ్స్లో చేరారు. అక్కడ రికవర్ అయి ఇంటికి వెళ్లిన తరువాత నేను కూడా వెళ్లి పరామర్శించడం జరిగింది. అప్పటికే వారికున్న రుగ్మతలన్నీ కంట్రోల్ అయిన తరువాత సర్జరీ చేసుకుంటే బాగుంటుందని నేను సూచించడం జరిగింది. దురదృష్టవశాత్తూ వారు మరణించడం జరిగింది. వెంకట రమణ గారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి మృతిపట్ల సంతాప సూచకంగా ఈ సభ కొద్ది సేపు మౌనం పాటిస్తుంది.

MR.SPEAKER: Now, "that this House places on record its deep sense of sorrow at the demise of Sri M.Venkata Ramana, Member of Andhra Pradesh Legislative Assembly and conveys its deep sense of sympathy to the Members of bereaved family".

**(The motion was unanimously adopted by the House)**

(సభలోని వారందరూ తమ స్థానాల నుండి లేచి నిలబడి కొద్దిసేపు మౌనం పాటించారు.)

**మిస్టర్ స్పీకర్: డిసెంబర్ 16వ తేదీన పాకిస్తాన్‌లోని పెషావర్‌లోగల సైనిక పాఠశాలలో మరణించిన మొత్తం 148 మంది విద్యార్థులు తదితరుల మృతిపట్ల ఈ సభ సంతాపాన్ని ముఖ్యమంత్రి గారు ప్రవేశపెడతారు.**

...

శ్రీ నారా చంద్రబాబు నాయుడు(కుప్పం): అధ్యక్షా, పాకిస్థాన్‌లోని పెషావర్‌లో తాలిబన్ల ఘాతుకానికి బలైన విద్యార్థుల మృతిపట్ల నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. 16వ తేదీన తాలిబన్ మిలిటెంట్లు ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లోకి ప్రవేశించి అత్యంత కిరాతకంగా విద్యార్థులపైన కాల్పులు జరిపారు. అదొక ఘోర ఉదంతం, మానవత్వానికి మాయని మచ్చ. కావున ఆ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఉజ్వల భవిష్యత్తు ఉన్న 146 మంది పసిపిల్లలను దారుణంగా ఊచకోత కోయడం చాలా అనాగరికమైన చర్య. ఉన్మాదంతో చేసిన ఆ చర్యల వల్ల ఆ పిల్లల తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ పక్షాన, యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజల పక్షాన వారికి సానుభూతిని తెలియజేస్తున్నాను. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ఇలాంటి సంఘటన ప్రపంచంలో ఎక్కడ జరిగినా ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరముంది. ఆ సంఘటనను మీడియాలో చూసినపుడు చాలా బాధ కలుగుతుంది. బంగారు భవిష్యత్తు ఉన్న పసిపిల్లలను చాలా దారుణంగా చంపారు. విద్యార్థులందరినీ లైన్‌లో నిలబెట్టి అందరినీ తలలమీద కాల్చారు. ఆ సంఘటన చూస్తే చాలా బాధాకరంగా ఉంది. ఆ దాడిలో పాల్గొన్న 8 మంది ఉగ్రవాదుల్లో ఇద్దరు తమను తాము పేల్చుకొని చనిపోయారు. సుదీర్ఘకాలం పోరాటం చేసేందుకు ఉగ్రవాదులు సిద్ధమై ఆయుధాలు, ఆహారం తీసుకొని కాల్పుల కార్యక్రమాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో వచ్చినట్లుగా తెలుస్తున్నది. వారి ఆలోచనా విధానం ఎలా ఉందో దానినిబట్టి తెలుస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ కక్ష తీర్చుకోవాలని, తాము చనిపోయినా ఫర్వాలేదు, పిల్లలను చంపి కక్ష తీర్చుకోవాలనే విధంగా పక్కా ప్రణాళికతో సిద్ధమై వచ్చినట్లుగా తెలుస్తున్నది.

ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ పెరగడం వల్ల ప్రపంచం ఒక గ్లోబల్ విలేజ్‌గా తయారైనది. ప్రపంచంలోని దేశాలన్నీ శాంతియుతంగా ఉండాలని, ప్రజలు పేదరికాన్ని అధిగమించి మెరుగైన జీవన ప్రమాణాలతో జీవిస్తూ వాతావరణాన్ని కాపాడుకోవాలని ఆలోచిస్తున్న సమయంలో ఇంత

దారుణంగా అనాగరిక సంఘటనలు జరగడం చాలా బాధ కలుగుతుంది. ఏ దేశంలో ఉగ్రవాదం ఉన్నా, తీవ్రవాదం ఉన్నా ప్రపంచానికి చాలా ప్రమాదం. ఇలాంటి సంఘటనల వల్ల అమాయకులు బలయ్యే పరిస్థితి వస్తుంది. దీనివలన ఏ దేశంలో ఉగ్రవాదం ఉన్నా ప్రజలు సుఖంగా, సంతోషంగా జీవించేందుకు అవకాశం ఉండదు. ఎక్కడ తీవ్రవాదులున్నారో అని, అలాంటి సంఘటనలు ఎక్కడ ఎపుడు జరుగుతాయో అని ప్రజలు అనునిత్యం భయపడుతూ బతికే పరిస్థితి వస్తుంది. ఇక్కడ ఈ సభలో కూర్చున్న మనకు కూడా అలాంటి ఆలోచన వస్తుంది. ఉన్మాదానికి ఎక్కడా కూడా హద్దులు లేవు. ఇలాంటి సంఘటనలను మనం కేవలం ఖండించడమే కాకుండా ప్రజలలోకి కూడా తీసుకెళ్లాల్సిన అవసరముంది. శాంతిభద్రతలను మనం ఏవిధంగా నెలకొల్పాలో ఆలోచించాలి. అలాంటి సంఘటనలు జరిగినపుడు కొన్ని దేశాలలో ఉగ్రవాదం ఏ విధంగా పెరుగుతుంది, శాంతిభద్రతలకు ఏ విధంగా అగాధం కలుగుతుందో అని మనకు ఆలోచన వస్తుంది. ఏది ఏమైనప్పటికీ ఆ సంఘటన మన దేశంలో జరగకపోయినా, పాకిస్థాన్‌లో జరిగినా అక్కడ చనిపోయినది కూడా పసిపిల్లలే. జరిగిన సంఘటనను మనమందరం ఖండించాల్సిన అవసరముంది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రపంచంలోని అన్ని దేశాల అధినేతలూ, ప్రజలూ ఆలోచించుకొని ఇలాంటి సంఘటనలు తిరిగి జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. మరొకసారి మృతుల కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, చనిపోయిన పిల్లల ఆత్మలకు శాంతి కలగాలని భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల)ః అధ్యక్షా, ఇటీవల పాకిస్థాన్‌లోని పెషావర్‌లో తాలిబన్లు జరిపిన దాడిలో దాదాపు 148 మంది పిల్లలు చనిపోవడం పత్రికలు, టీవీలో చూశాను. అభంశుభం తెలియని చిన్నారులను కాల్చి చంపడం నిజంగా దారుణం. ఎంత దారుణమైన పనులంటే చిన్న పిల్లలని కూడా చూడకుండా కాల్చి చంపారు. ఈ సంఘటనను మన రాష్ట్రం, మన దేశమే కాదు యావత్ ప్రపంచం కూడా దానిని ఖండించాలి. ఆ ఘటనలో చనిపోయిన పిల్లల తల్లిదండ్రులు పడుతున్న బాధ, ఆవేదనను ప్రపంచం మొత్తం ఉగ్రవాద చర్యలను ఖండిస్తున్నాయి. ఆ కుటుంబాలకు సానుభూతిని తెలియజేయడంలో మన వంతుగా రాష్ట్ర శాసనసభలో ఈ తీర్మానం ప్రవేశపెట్టినందున మా పార్టీ నుంచి కూడా ఆ తీర్మానాన్ని బలపరుస్తూ మా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాను.

శ్రీ గోరంట్ల బుచ్చయ్యచౌదరి (రాజమండ్రి-రూరల్)ః అధ్యక్షా, మొన్న పాకిస్థాన్‌లోని పెషావర్ నగరంలో జరిగిన ఉగ్రవాద సంఘటన ప్రపంచమంతా కూడా నివ్వెరబోయేలా చేసింది. ఈ రోజు ఉగ్రవాదం ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్నది. ముఖ్యంగా తాలిబన్ల దాడులవల్ల ఆనాడు న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ పేల్చివేత నుంచి మన దేశంలో ముంబై దాడులు, అంతకు ముందు భారత పార్లమెంట్‌పై దాడి, ఇటీవల పాకిస్థాన్‌లో దాడి జరిగిన సంఘటన

చూశాం. ఇరాక్‌లో వివాహం నిరాకరించారని దాదాపు 150 మంది మహిళలను ఊచకోత కోసిన సంఘటనలు చూసినపుడు ఉగ్రవాదం ఈ విధంగా పెరిగిపోతుందే అని బాధాకరంగా ఉంది. ఉగ్రవాదానికి ఏ దేశం కూడా దూరంగా లేదు. ఒకవైపు ఇరాక్, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, భారతదేశం కూడా టార్గెట్‌గా ఉండడమే కాకుండా చైనా, రష్యా, చెచెన్యాతోబాటు మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా ఖండంలోని నైజీరియాలో ఉగ్రవాదం రోజురోజుకూ పెరిగిపోవడం దురదృష్టకరం. మానవాళి మనుగడకే ఇది అత్యంత ప్రమాదకరంగా మారింది. దీనిని ప్రపంచమంతా ఖండించాలి. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లిన చిన్నపిల్లలపై జరిగిన పాశవిక దాడిని మనమందరం తీవ్రంగా ఖండించాలి. ఇస్లామిక్ స్టేట్ పేరుతో కొత్త సంస్థలు ఏర్పాటై ఉగ్రవాదం పెరగడం చాలా బాధాకరం. ఉగ్రవాద నిరోధం కోసం ప్రపంచవ్యాప్తంగా లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ప్రాణాలు కాపాడుకొనే పరిస్థితులు ఉండడం దురదృష్టకరం. దీనిని పూర్తిగా అందరం ఖండించడమే కాకుండా తీవ్రవాదాన్ని అణచివేయడం కోసం ప్రపంచవ్యాప్తంగా కార్యక్రమాలు జరగాలని ఆశిస్తూ, మృతుల కుటుంబాలకు నా సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి (రాయచోటి)ః అధ్యక్షా, పాకిస్థాన్‌లోని పెషావర్‌లోని పాఠశాల విద్యార్థులపై జరిగిన పాశవిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. విద్యార్థులపై పాయింట్ బ్లాంక్‌లో తుపాకులు పెట్టి కాల్చడం చాలా దారుణమైన విషయం. తీవ్రంగా పరిగణించాల్సిన విషయమేమంటే ఇరాక్, పాకిస్థాన్ తదితర దేశాల తరవాత 6వ స్థానంలో ఎక్కువగా ఉగ్రవాద దాడులు జరుగుతున్న దేశాలలో భారతదేశం కూడా ఉన్నట్లుగా తెలియవచ్చింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వంలో ఉన్నవారు మన దేశంలో కూడా ఇటువంటి సంఘటనలు జరిగే అవకాశాలు ఉంటాయి కాబట్టి ఇంటెలిజెన్స్ విభాగాన్ని బాగా విస్తరించి, ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకొని ఎక్కడా ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఆ దాడిలో మరణించిన విద్యార్థులకు ఆత్మ శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ పి.విష్ణుకుమార్ రాజు (విశాఖపట్నం-నార్త్)ః అధ్యక్షా, పెషావర్‌లో జరిగిన సంఘటన చాలా దారుణమైనది. ఒక పాఠశాలలో అత్యంత ప్రమాదకరమైన అడవి జంతువులను, క్రూరమృగాలను తీసుకొచ్చి వదిలినా 142 మందిని చంపవు. తాలిబన్లు, ఉగ్రవాదులు క్రూరమృగాల కంటె అత్యంత దారుణమైన వ్యక్తులు. అటువంటివారికి నాగరిక ప్రపంచంలో చోటు లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రతి ప్రభుత్వంపైన ఉంది. మన దేశంలో కూడా ఇటువంటి సంఘటనలు జరగకుండా అత్యంత కఠిన చర్యలు తీసుకొని, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ఏర్పాటుచేసుకొని ఎక్కడైనా అటువంటి సంఘటనలు జరిగే అవకాశముందని తెలిస్తే వెంటనే తగిన చర్య తీసుకొని ఉగ్రవాదాన్ని నిర్మూలించాల్సిన అవసరముంది. ప్రపంచంలో ఎక్కడ అటువంటి చర్య జరిగినా తప్పనిసరిగా అందరూ ఏకమై అటువంటి చర్యలు పునరావృతం

కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలియజేస్తూ, మృతులకు ఆత్మశాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబసభ్యులందరికీ నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ చాంద్ బాషా(కదిరి)ః అధ్యక్షా, మొన్న పాకిస్థాన్‌లోని పెషావర్‌లో జరిగిన పాశవిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారుల కుటుంబసభ్యులకు, తల్లిదండ్రులకు దేవుడు ధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నాను. ఇలాంటి సంఘటన జరిగినపుడు ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఖండించాలి. అభంశుభం తెలియని పిల్లలపైన ఈ విధంగా దాడి చేయడం హేయమైన చర్య కావున దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రపంచవ్యాప్తంగా కలసికట్టుగా నిరోధించాలని కోరుకుంటూ, మృతుల ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుని కోరుతున్నాను.

...

**మిస్టర్ స్పీకర్ః తాలిబన్ ఉగ్రవాదుల పైశాచిక చర్య దాడిలో 16-12-2014న పాకిస్తాన్‌లోని పెషావర్‌లో మరణించిన సైనిక పాఠశాలకు చెందిన148 మంది విద్యార్థినీ విద్యార్థుల మృతిపట్ల ఈ శాసనసభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుంది. హేయమైన ఉగ్రవాద మారణకాండను ఈ శాసనసభ తీవ్రంగా ఖండిస్తుంది. ఆ పిల్లల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి మృతికి సంతాపంగా ఈ శాసనసభ కొద్దిసేపు మౌనం పాటిస్తుంది.**

**(The Motion was unanimously adopted by the House)**

**(శాసనసభ రెండు నిమిషాలపాటు మౌనం పాటించింది)**

MR. SPEAKER: The House stands adjourned to meet again tomorrow at 9.00 a.m.

**(The House then adjourned at 10.12 A.M. to meet again at 9.00 AM on Friday, the 19th of December 2014)**